గురువారం 12 జూన్ 2025 6 శ్రీ సత్యసాయి

మున్సిపల్ చైర్‌పర్సన్‌కు సమ్మెనోటీసు అందజేస్తున్న నాయకులు, కార్మికులు

ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మున్సిపల్ చైర్‌పర్సన్‌కు సమ్మె నోటీసు అందజేత

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు సిద్ధమని సిఐటియు నాయకులు తెలిపారు. ఈ మేరకు బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి కి సమ్మె నోటీసు అందజేశారు..ఈ సందర్భంగా మండల కన్వీనర్ జె.వి. రమణ ,ఎస్. హైదర్ వలి, ఇంజనీరింగ్ కార్మిక సంఘం అధ్యక్షులు బొగ్గు నాగరాజు, పారిశుద్ధ కార్మిక సంఘం పట్టణ అధ్యక్షులు ఎం బాబు మాట్లాడుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కారంలో పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ,స్కిల్, సెమిస్కిల్డ్ కార్మికులకు వేతనాలు జీవో ప్రకారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్ విధానాన్ని రద్దు చేస్తే కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలన్నారు.,ఉద్యోగ భద్రత కల్పించాలని, హెల్త్ అలవెన్స్ వర్తింపచేయాలని, సంక్షేమ పథకాలను వర్తింపజేయాలన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వానికి అనేక రకాలుగా వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించనందున రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా సమ్మె నిర్వహించబోతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కార్మిక సంఘం నాయకులు అనిల్, బాబు, యోగి, కాటమయ్య, దస్తగిరి, పారిశుధ్య కార్మిక సంఘం నాయకులు ఓబులేసు, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

1 అడుగు ముందుకు.. 2 అడుగులు వెనక్కు..!

కేంద్రం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై గురువారం నాటికి ఏడాది కాలం పూర్తయ్యింది. ఈ కాలంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో అభివృద్ధి చూస్తే ఒక అడుగు ముందుకు.. మూడడుగులు వెనక్కు అన్న చందంగా మారింది. ఒకటి, రెండు అంశాల్లో కొంత పురోగతి కనిపిస్తున్నా తక్కిన వాటిని అటకెక్కించిందన్న విమర్శ ఉంది. అన్ని రంగాల వారీగా అభివృద్ధి అంతంత మాత్రమే అన్న విమర్శ ప్రజల నుంచి వ్యక్తం అవుతోంది.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

◆ ఏడాది కూటమి పాలనలో పురోగతి అంతంతే ◆ హంద్రీనీవా ప్రధాన కాలువ ఒక్కటే కదలిక

భూగర్భ జలాలు పెరిగే అవకాశాన్ని స్థానికంగా కోల్పోతామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం దీన్ని పట్టించుకోవడం లేదు. ఈ రెండు పనుల కోసమని ఈ బడ్జెట్‌లో రూ.3800 కోట్లు కేటాయించింది. ఇందులో కొంత పురోగతి కనిపిస్తున్నా... ఈ ప్రాజెక్టుపై నిర్మించ తలపెట్టిన బిటపి, పేరూరు ఎత్తిపోతల పథకాల పరిస్థితి అగమ్యచోరంగానే ఉంది. ఇప్పటికీ రెండు ప్రాజెక్టుల భూసేకరణనే చేపట్టలేదు. ఇక జిల్లాకు ఎంతో కీలకమైన తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. దీనిని పూర్తి స్థాయి ఆధునీకరణ చేపట్టాల్సి ఉండగా రూ.33 కోట్లతో మరమ్మతులతోనే సరిపెట్టే ఆలోచనలో ప్రభుత్వముంది. రూ.850 కోట్లతో చేపట్టిన సిఎల్‌డిపి సామూహిక బిందు తుంపర సేద్యం కింద ఉరవకొండ నియోజకవర్గంలో 50 వేల ఎకరాలకు నీటిని అందించే ప్రాజెక్టును చేపడతామని ఎన్నికలకు ముందు ప్రకటించారు. కాని ఇందులోనూ ఇప్పటికీ కదలిక కనిపించ లేదు.

సాగునీటి రంగం

సాగునీటి రంగంలో చూసినప్పుడు హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు ఈ ఏడాది కాలంలో కొంత పురోగతి కనిపిస్తోంది. దీనిపైనా జిల్లావాసుల్లో అసంతృప్తి ఉంది. ఎన్నికల ముందు కూటమి నేతలు హంద్రీనీవా ప్రధాన కాలువ వెడల్పు ఆరు వేల క్యూసెక్కులకు పెంచుతామని చెప్పారు. ఆచరణలోకి వచ్చే సరికి 3850 క్యూసెక్కులతోనే కాలువ వెడల్పు పనులను పూర్తి చేసే విధంగా టెండర్లు పిలిచింది. ఇక రెండో దశలో అందరూ వ్యతిరేకిస్తున్నా కాలువ లైనింగ్ పనులు చేపట్టింది. లైనింగ్ వల్ల

వ్యవసాయం...

జిల్లాలో అత్యధిక మంది ఆధారపడినది వ్యవసాయ రంగం. అందులోనూ మొట్ట వ్యవసాయమే అధికంగా ఉంటుంది. ఎన్నికలకు ముందు ప్రకటించిన విధంగా బిందు, తుంపెర సేద్యానికి 90 శాతం సబ్సిడీతో ఇస్తామన్న హామీని ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమల్లోకి తీసుకొచ్చింది. వ్యవసాయంలో ఇతర అంశాలైన రైతు భరోసా ఇంత వరకు అందలేదు. గిట్టుబాటు ధరలు కల్పించే విషయంలోనూ, ప్రకృతి వైపరిత్యాలతో పంటలు దెబ్బతిన్న రైతులకు ఇచ్చే పరిహారం ఇప్పటికీ అందలేదు. రైతులు పరిహారం కోసం ఎదురు చూస్తున్నారు.

పారిశ్రామిక రంగం

ఉమ్మడి అనంతపురం జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని పెద్దఎత్తున హామీలిచ్చారు. ఏడాది కాలంలో మడకశిర ప్రాంతంలో రెండు పరిశ్రమల ఏర్పాటుకు ఉత్తర్వులిచ్చారు. వీటి కార్యరూపం ఎప్పుడు అన్నది ఇంకా తెలియాల్సి ఉంది. పెద్దఎత్తున సోలార్, విండ్ పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులిచ్చారు. వీటి వలన ఉపాధి పెద్దగా లభించబోదన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. పైగా భూములు వేలాది ఎకరాలను ప్రయివేటు సంస్థలకు కట్టబెట్టే విధంగా నిర్ణయాలు ఉన్నాయన్న విమర్శలున్నాయి. ఇప్పటి వరకు కొత్తగా పరిశ్రమ ఈ ఏడాదిలో ప్రారంభమైంది మాత్రం ఒక్కటీ లేదు.

సమస్యల వలయంలో కేంద్రీయ విశ్వవిద్యాలయం

విభజన హామీల్లో భాగంగా అనంతపురం జిల్లాకు కేటాయించిన కేంద్రీయ విశ్వవిద్యాలయం ఇంకా సమస్యల వలయం నుంచి బయటకు రాలేదు సొంత క్యాంపస్‌లో గత ఏడాది జులై నుంచి విద్యాబోధన ప్రారంభమైనప్పటికీ ఇంకా మౌలిక సదుపాయల కల్పన పూర్తవలేదు. శాశ్వత బోధనా సిబ్బంది నియామకాలు జరగలేదు. అనేక సమస్యల నడుమ విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో అక్కడి విద్యార్థులు పలుమార్లు నిరసన కార్యక్రమాలు సైతం చేపట్టారు. పూర్తి స్థాయి మౌలిక సదుపాయల కల్పన, విద్యాబోధన సిబ్బంది నియామకం తదితర వాటి కోసం నిధుల కేటాయింపులు చేపట్టాల్సి ఉంది. ఈ ఏడాదిలో అటువంటి కేటాయింపులు బడ్జెట్‌లో జరగలేదు.

ఇళ్ల పట్టాల కోసం ఆందోళన

ప్రజాశక్తి తనకల్లు

అర్హులైన పేదలకు ఇళ్లపట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో పేదలు స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండల పరిధిలోని వివిధ గ్రామాలలో సొంత ఇల్లు లేని నిరుపేదలు ఎంతో మంది ఉన్నారన్నారు., వారందరూ గత 4, సంవత్సరాల క్రితం గుడిసెలు వేసుకోని, తహశీల్దార్ కార్యాలయంలో ఇళ్లపట్టాల కోసం విన్నవించుకున్నారన్నారు. మండల కేంద్రానికి సమీపంలోని తనకల్లు గ్రామ పొలం సర్వేనెంబర్ 793 లో సుమారు 4 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉందని అందులో సిఐటియు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పేదలు గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారన్నారు. వారందరికీ ఇళ్లపట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ శోభా సువర్ణమ్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం శివన్న, సిఐటియు ఒంటెద్దు వేమన్న, వెంకటరమణ, చలపతి, శ్రీనివాసులు, తదితరులతో పాటు పేదలు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు, పేదలు

బసంపల్లిలో ఏరువాక

ప్రజాశక్తి - చెన్నేకొత్తపల్లి

రాప్తాడు నియోజకవర్గం చెన్నేకొత్తపల్లి మండలం బసంపల్లి గ్రామంలో ఏరువాక కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రారంభించారు.. రైతు చెంద్రాయుడు పొలంలో రైతులు, అధికారులతో కలిసి ఏరువాకను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం వేరుసెనగ విత్తనాన్ని సబ్సిడీపై అందిస్తోందని.. దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరోవైపు బసంపల్లి గ్రామంలో రూ. 40లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన సిసి రోడ్లను ఆమె ప్రారంభించారు. అలాగే రూ. 35వేలతో నిర్మించిన పశువులు, గొర్రెలు, మేకల దాహార్తి తీర్చడానికి మంచినీటి తొట్టెను కూడా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, గ్రామస్థులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధే లక్ష్యం : మంత్రి సవిత

ప్రజాశక్తి -పరిగి

రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని బీసీ సంక్షేమ చేనేత టెక్స్టైల్ శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. మండలంలో రూ. 3 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన రోడ్డు పనులను మంత్రి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిగి మండలంలోని ఎర్రగుంట,విట్టపల్లి ,తిరుమల పల్లి గ్రామాలకు రూ. 9 కోట్ల నిధులు వెచ్చించి పనులు నిర్వహించామని ఇప్పటికే నాలుగు కోట్ల రోడ్డు పనులు పూర్తి అయ్యాయని చెప్పారు. మిగిలిన పనులు త్వరలోనే పూర్తి చేస్తామని అన్నారు. నియోజకవర్గానికి అప్పుడప్పుడు వలస పక్షులు వస్తున్నాయని అవి తమ ఉనికిని చాటుకునేందుకు చాలా ప్రయత్నాలు చేస్తున్నాయి ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వం హయాంలో ఐదేళ్లలో జరిగిన అభివృద్ధినితాము సంవత్సరంలో చేశామని ఈ విషయంలో ఎవరైనా చర్చకు వస్తే సిద్ధమని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గోవింద్ రెడ్డి, మాజీ జడ్పిటిసి సూర్యానారాయణ, మారుతి ప్రసాద్, వెంకటేష్, సోమప్ప, తెలుగు యువత నాయకులు ప్రవీణ్ రెడ్డి, నాగభూషణం, పైడేటి రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి సవిత

గిరిజన సదస్సుల్లో పాల్గొని సమస్యలు పరిష్కరించుకోండి

కలెక్టర్ టిఎస్ చేతన్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లాలో గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కోసం భారత ప్రభుత్వం చేపట్టిన దర్తి అభజన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ పథకంపై జిల్లాలో ఈనెల 15 నుంచి 30 వరకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ నుంచి ఒక ప్రకటన విడుదలైంది. గిరిజనులకు 25 పథకాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని సోమందేపల్లి మండలంలోని నాగినాయని చెరువు తండా, తనకల్లు మండలంలోని ముండ్ల వారి పల్లి, గాండ్ల పెంట మండలంలోని తుమ్మల బైలు తండాలలో గిరిజన సంబంధిత శాఖల సమన్వయంతో ఎంపీడీవోల ఆధ్వర్యంలో ఈ సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సదస్సుల్లో గిరిజన ప్రాంత ప్రజలు పాల్గొని ఆధార్, బ్యాంకు అకౌంట్, హెల్త్ కార్డ్, గ్యాస్ కనెక్షన్లు, జాబ్ కార్డు, విద్యుత్ కులాయి కనెక్షన్లు, అటవీ భూమి సమస్యలు, ఇల్ల నిర్మాణాలు, రహదారులు, మొబైల్ మెడికల్ యూనిట్స్ ఏర్పాటు, అంగనవాడి సెంటర్ల సమస్యలపై పరిష్కరించుకోవాలని కలెక్టర్ కోరారు.

మధ్యాహ్న భోజన పథకానికి సన్న బియ్యం పంపిణీ

రాష్ట్ర ప్రభుత్వం జూన్ 2025 నెల నుండి మధ్యాహ్న భోజన పథకం కింద పాఠశాలలకు, సంక్షేమ వసతి గృహాలకు నాణ్యమైన మేలి రకం సన్న బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టిందని కలెక్టర్ టిఎస్ చేతన్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు అవసరమైన బియ్యం తిరుపతి జిల్లాలోని ఏర్పేడు గోదాం నుంచి దిగుమతి చేసుకోవడం జరిగిందన్నారు. దిగుమతి చేసుకున్న బియ్యాన్నికదిరి మండల స్థాయి గోదాం నుంచి 25 కేజీల బస్తాగా ప్యాకింగ్ చేసి జిల్లా అంతట సరఫరా చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో 2033 పాఠశాలలకు గాను 255. 250 మెట్రిక్ టన్నుల నాణ్యమైన సన్న బియ్యం 25 కేజీల బ్యాగులతో పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అలాగే 153 సంక్షేమ వసతి గృహాలకు 231. 600 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేయడం జరిగిందన్నారు. ప్రతి 25 కేజీల బస్తాకు క్యూఆర్ కోడ్ ను తగిలించి పంపిణీ చేయడం జరిగిందని ఈ క్యూ ఆర్ కోడ్ ను స్కాన్ చేయడం ద్వారా అన్ని రకములైన వివరాలు పొందవచ్చునని చెప్పారు.

పాఠశాలల్లో సమస్యల స్వాగతం

దాదాపు రెండు నెలల తరువాత పాఠశాలలు గురువారం నుంచి పున:ప్రారంభం కానున్నాయి. వేసవి సెలవుల ముగింపు అనంతరం గురువారం నుంచి తరగతులు ప్రారంభం అవుతున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అన్ని పాఠశాలల పున:ప్రారంభానికి ఇప్పటికే విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆయా పాఠశాలల తరగతి గదులను సిద్ధం చేశారు. తల్లిదండ్రులు కూడా పిల్లలను పాఠశాలలకు పంపే ఏర్పాట్లలో నిమగ్నం అయ్యారు. అయితే పలు పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన కనీస మౌలిక వసతుల కల్పన పూర్తి స్థాయిలో జరగనట్లు తెలుస్తోంది. పట్టణ ప్రాంతాల్లో పరిస్థితి కొంత మెరుగ్గా ఉన్నా, గ్రామాల్లో పాఠశాలల పరిస్థితి ఇబ్బందిగానే ఉంది.కూటమి ప్రభుత్వం గత సంవత్సరం తల్లికి వందనం ఇవ్వలేదు. కనీసం ఈ సంవత్సరం ఈ నెల 14న ఇస్తామన్న తల్లికి వందనం ఇస్తారా...? లేదా అనే అంశంపైనే సర్వత్రా చర్చ జరుగుతోంది.

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం 5129 పాఠశాలలున్నాయి. వీటి పరిధిలో 3.58,072 మంది విద్యార్థులు ఉన్నారు. వీరందరికీ ప్రభుత్వం పుస్తకాలు, బ్యాగులు, యూనిఫామ్, బెల్టులు, బూట్లు అందజేయాల్సి ఉంది. పాఠశాలల ప్రారంభం రోజును వీటిని అందిస్తామని ప్రభుత్వం చెబుతోంది. అయితే ఏ మేరకు ఇవి పాఠశాలలకు చేరాయన్న దానిపై ఇప్పటికీ స్పష్టత లేకుండా ఉంది. మొత్తం విద్యార్థులకు ఒకే సారి ఇస్తారా... లేక గతేడాది మాదిరి గానే కొద్దిమంది విద్యార్థులకు అందజేసి తరువాత ఇస్తామని చెబుతారా అన్నది తెలియాల్సి ఉంది..

నేటికి పూర్తి కాని నాడు-నేడు పనులు

గత ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమంతో విద్యాలయాల అభివృద్ధికి పెద్ద పీట వేసింది. మూడు విడతలుగా ఆయా పాఠశాలలకు నిధులను విడుదల చేసింది. అయితే ఈ పనులు చాలా పాఠశాలల్లో అసంపూర్తిగా ఉన్నాయి. పట్టణ ప్రాంతాల్లో కొంత మేర పనులు జరిగినా, గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం ఆ వేగంతో పనులు జరగనట్లు తెలుస్తోంది. పాత తరగతి గదిలోనే ఈ ఏడాది కూడా పాఠాలు బోధించే పరిస్థితి చాలా పాఠశాలల్లో కన్పిస్తోంది. శిథిలమైన తరగతి గదులు నేటికీ చాలా పాఠశాలల్లో దర్శనం ఇస్తున్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కొన్ని పాఠశాలల్లో కనీసం మరుగుదొడ్లు కూడా లేని పరిస్థితి. కొన్ని పాఠశాలల్లో మరుగుదొడ్లు లేకపోగా ఉన్నచోట్ల ఉపయోగించే స్థితిలో లేవు. దీంతో పిల్లలు ఆరు బయటకు వెళ్లక తప్పని దుస్థితి. దీంతో బాలికలు ఇబ్బంది పడుతున్నారు. అనేక పాఠశాలల్లో తరగతి గదులు అధ్వానంగా ఉన్నాయి. కొన్ని పాఠశాలలకు ప్రహరీలు లేవు. వక్కనే మురుగు కాలువలు ఉన్నాయి. దీంతో పశువులు, పందులు వంటివి పాఠశాలల ఆవరణల్లో తిరుగుతూ విద్యార్థులకు ఇబ్బంది కలిగిస్తున్నాయి. మరికొన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండేందుకు ప్రత్యేక గదులు లేవు. దీంతో తరగతి గదుల పక్కన... లేదంటే పాఠశాలలో ఓ మూలన నాలుగు బండల మాటున వంట తయారు చేస్తున్నారు. ఆరుబయట వంట శాలలు ఉన్న పాఠశాలల్లో వర్షాకాలం వచ్చిందంటే వంటలు చేయడానికి ఇబ్బందిగా ఉంటోంది. మొత్తం మీద ఈ సారి కూడా చాలా వరకు పాఠశాలల్లో విద్యార్థులకు సమస్యలు స్వాగతం పలికేలా పరిస్థితి కన్పిస్తోంది.

తల్లికి వందనంపై సర్వత్రా చర్చ

నేటి నుంచి పాఠశాలలు పున: ప్రారంభం అవుతున్నాయి. దీంతో ఎక్కడ చూసినా విద్యార్థుల తల్లిదండ్రులు తల్లికి వందనంపైనే చర్చలు సాగిస్తున్నారు. గత ప్రభుత్వంలో పిల్లలు పాఠశాలలకు దూరం కాకూడదు అని బడి పిల్లలు బడిలోనే ఉండాలన్న ఉద్దేశంతో చదువుకునే ప్రతి విద్యార్థి తల్లి ఖాతాలో రూ. 15 వేలు గత ప్రభుత్వం జమ చేసి, ఇందులో పాఠశాల మరుగుదొడ్ల నిర్వహణ కోసం రూ.1000 వెనక్కి తీసుకుంది. కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రచార సమయంలో గత ప్రభుత్వం కేవలం కుటుంబంలో చదువుకునే ఒక విద్యార్థికి మాత్రమే అమ్మ ఒడి ఇచ్చిందని, తాము అధికారంలోకి వస్తే ఇంట్లో ఎంత మంది ఉంటే అందరికి ఇస్తామని హామీ ఇచ్చింది. అయితే గత సంవత్సరం కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకానికి ఎసరు పెట్టింది. ఈ విద్యా సంవత్సరం విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ పూర్తి స్థాయిలో విధి విధానాలను చర్చించి ఖచ్చితంగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. జూన్ 12న పాఠశాలలు ప్రారంభం కాగానే విద్యార్థుల తల్లుల ఖాతాలోకి డబ్బులు జమ చేస్తామన్నారు. 12 కాస్తా 14న వేస్తాం అంటున్నారు. మొత్తానికి పాఠశాలల నుండి విద్యార్థుల వివరాలు, తల్లుల బ్యాంకు ఖాతాలు ఇప్పటికే సేకరించారా, లేకపోతే పాఠశాలలు తెరిచిన అనంతరం విధి విధానాల పేరుతో ఈ విద్యా సంవత్సరం సైతం ఎగనామం పెడతారా...? అనే అనుమానాలను విద్యార్థుల తల్లిదండ్రులు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఒక ఏడాది అమ్మకు వందనం రాకపోవడంతో ఈ ఏడాది కూడా వస్తుందో రాదో నన్నా ఆందోళన పేద ప్రజల్లో నెలకొంది.

నేటి నుంచి పాఠశాలలు పున : ప్రారంభం

'తల్లికి వందనం' పై సర్వత్రా చర్చ

పాఠశాలలకు సరఫరా చేసే పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఇఒ, తదితరులు

బిజెపిని ప్రశ్నించే దమ్ము బాబు, జగన్‌కు లేదు..!

ఎపి పిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిల

ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి

కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపిని ప్రశ్నించే దమ్ము చంద్రబాబు నాయుడు, వైఎస్.జగన్మోహన్ రెడ్డిలకు లేదని పిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిల రెడ్డి విమర్శించారు. బుధవారం నాడు అనంతపురం జిల్లాలో ఆమె పర్యటించారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన విస్తత స్థాయి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో ఏ ఒక్క హామీని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ప్రకటించిన చంద్రబాబు ఈ ఏడాది కాలంలో 17 వేల కోట్ల భారాన్ని ప్రజలపై వేశారని పేర్కొన్నారు. సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన హామీలు కూడా అమలు చేయలేదన్నారు. నిరుద్యోగులకు ఇస్తామన్న నిరుద్యోగ భృతి ఇవ్వలేదని గుర్తు చేశారు. ఉచిత బస్సుల అమలు జరగలేదన్నారు. అన్ని రకాల హామీలను అమలు జరుపకుండా మోసం చేశారని విమర్శించారు. ఎన్నికల హామీల అమలుపై కాంగ్రెస్ పార్టీ పోరాటం సాగిస్తుందని చెప్పారు. కేంద్రంలో అధికారంలోనున్న బిజెపి విభజన హామీలు ఏ ఒక్కటీ అమలు చేయలేదని విమర్శించారు. వీటిని అమలు చేయాలని అడిగే దమ్ము అటు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, ఇటు మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డికి లేదని దుయ్యబట్టారు. చంద్రబాబుది బిజెపితో పొత్తు అయితే వైఎస్.జగన్మోహన్ రెడ్డి అక్రమ పొత్తు అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ బలమంతా వైసీపీ వైపు వెళ్లిందని చెప్పారు. ఆ బలాన్ని తిరిగి పొందే దిశగా కలిసికట్టుగా అందరం కలిసి పని చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎపి పిసిసి అధ్యక్షురాలు షర్మిల

షర్మిల ఎదుటే నేతల తోపులాట

పిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిల రెడ్డి ఎదుటే కాంగ్రెస్ నేతలు ఒకరు ఒకరు ఘర్షణ దిగారు. వేదికపైకి తమను పిలవకుండా అవమానించారంటు గుంతకల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి కావాలి ప్రభాకర్ వేదిక ఎదుట ఉన్న కుర్చీలో కాకుండా కింద కూర్చొని నిరసనకు దిగారు. ఆయన మద్దతుదారులు నిరసనగా దిగడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో తాను కూడా కుర్చీలో కాకుండా కిందనే కూర్చుంటానని షర్మిళ రెడ్డి కుర్చీలో కాకుండా కింద కూర్చున్నారు. అనంతరం నేతలు సర్ది చెప్పి షర్మిలను వేదిక పైన కుర్చీలో కూర్చోబెట్టారు. అటు తర్వాత కూడా నేతల మధ్య వివాదం సద్దుమణగ లేదు. డిసిసి అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి సమన్వయం చేయడంలో లోపం ఉందంటూ నినాదాలు చేశారు. దీంతో కొంతసేపు గందరగోళం నెలకొంది. నేతల మధ్య తోపులాట జరిగింది. తర్వాత షర్మిల రెడ్డి కలుగజేసుకుని నేతలు సమన్వయంతో పార్టీని బలోపేతానికి కృషి చేయాలని చెబుతూ సమావేశాన్ని కొనసాగించారు.

16న పెనుకొండలో యోగాంధ్ర

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్

జిల్లా స్థాయి యోగాంధ్ర కార్యక్రమాన్ని ఈ నెల 16వ తేదీన పెనుకొండ సమీపంలోని కియా పరిశ్రమ ఆవరణములో నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో ఆనంద్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో డివిజన్ లోని మండల స్థాయి అన్ని శాఖల అధికారులతో యోగాంధ్ర -2025 నిర్వహణ ఏర్పాట్లకు సంబంధించి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా,డివిజన్,మండల స్థాయి అధికారులు వారి సిబ్బంది,టీచర్స్ అసోసియేషన్,మర్చంట్ అసోసియేషన్, వ్యాపార వేత్తలు,బ్యాంక్ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు,జిల్లాలోని ప్రజలు అందరూ తప్పకుండా హాజరు కావాలని కోరారు.

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి - తాడిమర్రి

మండలంలో పుల్లా నారాయణ పల్లి, పిన్నదరి గ్రామాల్లో పర్యటించిన పోలీసులు సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాలలో ప్రశాంతమైన జీవనాన్ని సాగించాలని అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ శ్యామ్ రావు, ఎస్ఐ కృష్ణవేణి యాదవ్, పోలీసులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అమలు చేయండి

ప్రజాశక్తి - మడకశిర రూరల్

మడకశిర పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలు అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు పట్టణం దినదిన అభివృద్ధితోపాటు ట్రాఫిక్ కూడా పెరిగిపోయింది అంతేకాకుండా కొత్తగా కోడికొండ చెక్పోస్ట్ సిరా మడకశిర మీదుగా హైవే కావడంతో భారీ వాహనాలు అధికంగా పట్టణంలో నుండి వెళుతున్నాయిజ వాహన చోదకులు మితిమీరిన వేగంతో పట్టణంలో నడపడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి పెరిగిన వాహనాల రద్దీ తో ప్రజలు తీర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ నిబంధనలు పూర్తిస్థాయిలో అమలు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

కదిరిలో వాహనాల ఫిట్నెస్ రెన్యువల్‌కు బ్రేక్

ప్రజాశక్తి - కదిరి టౌన్

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు వాహనాల ఫిట్నెస్ రెన్యువల్ నేటి నుండి కదిరి రవాణా శాఖ కార్యాలయంలో జరగవని కదిరి ఆర్టీవో శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు గూడ్స్ వాహనాలు ఎఫ్ సి ఫిట్నెస్ రెన్యువల్ కదిరి ఆర్టీవో కార్యాలయంలో జరుగుతుండేవన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాలు మేరకు ఇకనుండి బుక్కపట్నం సమీపంలో శివశంకర్ ఎంటర్ప్రైజెస్ ఏజెన్సీ వారికి ఎఫ్ సి చేయడానికి అనుమతులు జారీ చేశామన్నారు. కావున రవాణా వాహనాల ఫిట్నెస్ సర్టిఫికెట్లు రెన్యువల్స్ శివశంకర్ ఎంటర్ప్రైజెస్ ఏజెన్సీ వారిచే ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్ (ఎటిఎస్) బుక్కపట్నం సెంటర్ వద్ద చేయించుకోవాలని తెలిపారు.

వేరుశనగ పంపిణీ

ప్రజాశక్తి - పరిగి

మండలంలోని ఊటకూరు,ఎర్రగుంట గ్రామంని ఆర్ బి కే కేంద్రాలలో పరిగి మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సబ్సిడీ వేరుశనగను ఏవో విజయభారతి మండల కన్వీనర్ గోవింద్ రెడ్డి పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో టిడిపి మండల మండల్ కన్వీనర్ గోవిందరెడ్డి, జెడ్పిటిసి సూర్యనారాయణ,మండల వ్యవసాయ అధికారి యస్ విజయభారతి గారు,వ్యవసాయ విస్తరణ అధికారి నాగవేణి, రైతు సేవ కేంద్ర సిబ్బంది మంజుల, హరీష్ ,అనసూయ , ప్రజాప్రతినిధులు, రైతులు హాజరయ్యారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిదిలోని బత్తలపల్లి, జగరాజుపల్లి గ్రామాలలో బుధవారం సామాజిక ఆరోగ్య అధికారి నగేష్ గర్భిణులకు, చిన్న పిల్లలకు ఇచ్చు వ్యాధి నిరోదక టీకాలపై అవగాహన కల్పించారు. గర్భిణులు తరచు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యక్తి గత శుభ్రత, పరిసరాలు శుభ్రత పాటించాలన్నారు. ఈకార్యక్రమంలో సూపర్ వైజర్లు వెంకట రమణ, చంద్రకళ, ఎం ఎల్ హెచ్ పీ సత్యమ్మ, ఆరోగ్య కార్యకర్తలు జ్యోతి,ప్రమీల,ఆశాకార్యకర్తలు లక్ష్మీదేవి, శ్రీదేవి,లక్ష్మీనరసమ్మ, జ్యోతి పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కరించాలి

ప్రజాశక్తి - గాండ్లపెంట

తమ గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యను పరిష్కరించాలని మండలంలోని జీనలకుంట వద్దిరెడ్డిపల్లి కొట్లపల్లి తదితర గ్రామాల రైతులు బుధవారం స్థానికసబ్ స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు ఈ సందర్భంగా పలు రైతులు మాట్లాడుతూ దాదాపు 15 రోజుల నుంచి బోరు బావులు కింద సాగుచేసిన పంట పొలాలకు నీరు లేక పంటలు ఎండిపోతున్నాయన్నారు. సమస్యను పలుమార్లు ట్రాన్స్‌కో అధికారులకు తెలియజేసినా వారు ప్టించుకోవటం లేదు. తమ సమస్య పరిష్కారం అయ్యేవరకు ఆందోళన కొనసాగిస్తామని తెగేసి చెప్పారు. ఆందోళన విషయం తెలుసుకున్న ట్రాన్స్‌కో ఎడి ఓబులేసు సబ్‌స్టేషన్ వద్దకు వచ్చి రైతులతో మాట్లాడారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటరమణారెడ్డి, రైతులు కొండారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, తిమ్మారెడ్డితో పాటు ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఆర్ఐగా నేలకోటప్ప

ప్రజాశక్తి - చిలమత్తూరు

ఆర్ఐ గా నేలకోటప్ప ఉద్యోగోన్నతి పొందాడు. చిలమత్తూరు రెవెన్యూ కార్యాలయంలో ఇదివరకు సీనియర్ అసిస్టెంట్ గా పని చేస్తున్న నేలకోటప్పకు ఆర్ఐగా ప్రమోషన్ వచ్చింది. ఈ మేరకు రెవెన్యూ సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించారు.

పారిశ్రామికవేత్తలుగా గ్రామీణ యువత

బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

గ్రామీణ యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత వెల్లడించారు. యువతకు ఉద్యోగాల కల్పనతో పాటు పలువురికి ఉపాధి కల్పించేలా 25 రకాల చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్, ఎంటర్ ప్రైజెస్ డెవలప్మెంట్ ఇన్ ఆంధ్ర ప్రదేశ్ (సీ డాప్), సెంచూరియన్ యూనివర్శిటీ ఆధ్వర్యంలో చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుపై యువతకు అవగాహన సదస్సును మంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు.. స్వర్ణాంధ్ర 2047 లక్ష్య సాధనలో భాగంగా రాష్ట్రంలో ప్రతి ఇంటి నుంచి పారిశ్రామికవేత్తను తీర్చిదిద్దే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉపాధి, మార్కెట్ ఆధారిత నైపుణ్య కార్యక్రమాలపై శిక్షణ అందజేస్తూ చిన్న తరహా పరిశ్రమలను నెలకొల్పాలని నిర్ణయించిందన్నారు. దీనిలో భాగంగా 25 రకాల పరిశ్రమలను ఏర్పాటు చేయడంపై యువతకు శిక్షణ ఇవ్వడంతో పాటు సబ్సిడీ రుణాలు అందజేయనుందన్నారు. అదే సమయంలో వారు చేసే ఉత్పత్తులకు ప్రభుత్వమే మార్కెట్ సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుపై యువతలో ఉన్న అపోహాలను శిక్షణా కార్యక్రమం ద్వారా తొలగిస్తామన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించి తీరుతామని మంత్రి సవిత స్పష్టంచేశారు. పారిశ్రామికాభివద్ధిలో పెనుకొండ నియోజక వర్గం అగ్ర స్థాయిలో నిలిపేలా కషి చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ఆయా ప్రాంతాల అవసరాలు, స్థానికంగా లభ్యమయ్యే ముడి సరకు కు అనుగుణంగా పరిశ్రమల ఏర్పాటుపై ఉత్సాహవంతులైన యువతకు అవగాహన కల్పించనున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు. అవసరమనుకుంటే పంచాయతీ స్థాయిలోనూ ఇటువంటి అవగాహన సదస్సులు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఆనందకుమార్, సిడాఫ్ స్టేట్ మిషన్ మేనజర్ విజయకుమార్ ,సెంచూరియన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ అనిల్ కుమార్, ఏపి ఫుడ్ కార్పొరేషన్ జోనల్ ఆఫీసర్ మారుతి, జేడిఎం సూర్యనారాయణ, తహశీల్దార్ శ్రీధర్, ఎంపిడిఒ నరేష్‌కృష్ణ, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు,మండల పార్టీ కన్వీనర్ ఈశ్వర్ ప్రసాద్, పట్టణ కన్వీనర్ శ్రీరాములు యాదవ్, నారాయణ స్వామి, లక్ష్మీనారాయణ రెడ్డి సూర్యనారాయణ రెడ్డి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేటు పాఠశాలల్లోనూ రిజర్వేషన్ వర్తింపజేయాలి

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఎస్సీ ఎస్టీలకు రిజర్వేషన్ ప్రకారం ప్రయివేటు విద్యాసంస్థల్లో సీట్లు భర్తీ చేసి ఉచిత విద్య అందించాలని జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు చేకూరి గంగులయ్య,,కదిరి డివిజన్ ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ రాంప్రసాద్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వేల రూపాయలు వసూలు చేస్తున్న నారాయణ, కేశవరెడ్డి విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా విద్యపేరుతో వ్యాపారం చేస్తున్న ప్రయివేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు.కార్పొరేట్ విద్యాసంస్థల్లో విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే బుక్స్, యూనిఫామ్ పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర నుండి వేలాది రూపాయలు వసూలు చేస్తూ వ్యాపారాలు సాగిస్తున్నా జిల్లా విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సమంజసం కాదన్నారు. 2009 లో తీసుకొచ్చిన విద్యాహక్కు చట్టం ప్రకారం కార్పొరేట్, ప్రయివేటు విద్యా సంస్థల్లో పుస్తకాలు యూనిఫామ్ బెల్ట్ విక్రయించకూడదన్న నిబంధన ఉన్నప్పటికీ, నారాయణ యాజమాన్యం ప్రైవేట్ గా ఒక రూమ్ తీసుకొని శ్రీ చైతన్య నారాయణ కేశవరెడ్డి పేరు మీద ముద్రించిన పుస్తకాలు, యూనిఫాం అమ్ముతున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనలు విరుద్ధంగా నడుస్తున్న శ్రీ చైతన్య విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని లేకపోతే విద్యార్థుల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.

శాస్త్రీయ సమాజ స్థాపనే జన విజ్ఞాన వేదిక లక్ష్యం

ప్రజాశక్తి-హిందూపురం

శాస్త్రీయ సమాజ స్థాపన కోసం జనవిజ్ఞాన వేదిక నిరంతరం కృషి చేస్తోందని ఆ సంస్థ ప్రతినిధులు డాక్టర్ ఈటి రామ్మూర్తి, పి. రామకృష్ణ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని పీపుల్స్ క్లినిక్ ఆవరణలో జన విజ్ఞాన వేదిక సభ్యత్వ నమోదు గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జనవిజ్ఞాన వేదిక సామాన్య ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తోందన్నారు. అదే విధంగా ఓవైపు మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తూ మరోవైపు ప్రజలు ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలకు పరిష్కారాలను చూపించడం జరుగుతుందని తెలిపారు. మేధావులు, విజ్ఞానవంతులు జనవిజ్ఞాన వేదికలో సభ్యులుగా చేరి సమాజాభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక సభ్యులు ప్రమీల, నారాయణస్వామి, ఉగ్రప్ప, అబ్దుల్ హక్, రియాజ్ ఖాన్, వెంకటలక్ష్మి, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

గోడ పత్రికలు విడుదల చేస్తున్న జెవివి నాయకులు

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి : ఎపిడబ్ల్యూజెఎఫ్

డిఆర్ఒకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టరేట్ వద్ద పాత్రికేయులు ప్లే కార్డులు పట్టుకొని నినాదాలు ఇచ్చారు. అనంతరం డిఆర్ఒ విజయసారథికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, జర్నలిస్టులకు ఇంటి స్థలాలతో పాటు పక్కా గృహాలు నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. ఒక్కొక్క జర్నలిస్టుకు మూడు సెంట్లు స్థలం ఇవ్వాలని గత ప్రభుత్వం జీవో జారీ చేసి దరఖాస్తులు స్వీకరించిందని అది ఇంతవరకు అమలు కాలేదన్నారు. మారిన పరిస్థితులలో జర్నలిజం వృత్తి ప్రమాదంలో పడిందని, ఉద్యోగ భద్రత, రక్షణ కోసం మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు పింఛన్ సౌకర్యం ఇతర రాష్ట్రాలలో అమలవుతోందని ఏపీలో కూడా అమలు చేయాలని కోరారు.. అక్రిడిటేషన్ కమిటీలో అన్ని యూనియన్లకు ప్రాతినిత్యం కల్పించాలని, జర్నలిస్టులపై జరిగే దాడులను అరికట్టడానికి రాష్ట్రంలో హెూం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో హై పవర్ కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు పూల శ్రీనివాసులు, ఐ న్యూస్ విలేకరి శివరామకృష్ణ, ప్రజాశక్తి సీనియర్ పాత్రికేయుడు బసప్ప, ప్రజాశక్తి నాగార్జున, 99 రవిశంకర్, సూర్య వెంకట చలపతి, ప్రజాశక్తి సాయి ప్రసాద్, 6 టీవీ చలపతి తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : జిల్లాలో పని చేస్తున్న ప్రతి వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని ఎపిడబ్ల్యూజెఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మంత్రి సత్యకుమార్‌కు అందజేశారు, ఈ సందర్భంగా ఎపిడబ్ల్యూజెఎఫ్ నాయకులు మురళి గౌడ్, నాగభూషణం మాట్లాడుతూ ఎన్నో ఏళ్లు జర్నలిస్టులు వివిధ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు.. ఎన్నికల ముందు ప్రతి పార్టీ జర్నలిస్టుల సమస్యలను పరిష్కారిస్తామని హామీలు ఇవ్వడం తప్ప.. ఎక్కడా నెరవేర్చింది లేదన్నారు. ఈ సార్వత్రిక ఎన్నికల ముందు కూడా కూటమి పార్టీలు జర్నలిస్టులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. అందుకే రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టుల డిమాండ్స్ డే ను నిర్వహిస్తున్నట్టు చెప్పారు.. ఏడాది కాలంగా అక్రిడిటేషన్ లు కూడా మంజూరు చేయలేదన్నారు. అక్రిడిటేషన్లతో పాటు ఇంటి స్థలాలు, ఇళ్ల నిర్మాణం, ఆరోగ్య బీమా వంటి డిమాండ్లను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు భాస్కర్ గౌడ్, వెంకటేష్ చౌదరి, మజ్జిగ భాస్కర్, ప్రసాద్ రెడ్డి, గంటపారా నాగరాజు, శ్రీకాంత్ గౌడ్, రాజా, బాబయ్య, ఆంజనేయులు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ టౌన్ : జిల్లాలో పని చేస్తున్న ప్రతి వర్కింగ్ జర్నలిస్టుకు 3సెంట్ల ఇంటి స్థలంతో పాటు ఇళ్ల నిర్మాణం, ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీడబ్ల్యూజెఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు కె. నవీన్ కుమార్ కోరారు. జర్నలిస్టులు తమ సమస్యలు పరిష్కరించాలనికోరుతూ ఏపీడబ్ల్యూజెఎఫ్ నాయకులతో కలిసి పట్టణంలోని ఆర్ డి వో కార్యాలయంలో ఏవో గిరికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రతి పార్టీ జర్నలిస్టుల సమస్యలను పరిష్కారిస్తామని హామీలు ఇవ్వడం తప్ప.. ఎక్కడా నెరవేర్చింది లేదన్నారు.ప్రభుత్వాలు మారుతున్న జర్నలిస్ట్ ల జీవన స్థితి గతులు మారడం లేదన్నారు. అక్రిడిటేషన్లు, ఇంటి స్థలాలు, ఇళ్ల నిర్మాణం, ఆరోగ్య బీమా, ఉచిత విద్య,వంటి డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నవీన్ కుమార్, జాకీర్ హుస్సేన్, మల్లికార్జున, మురళీ, మూర్తి,హరి, రఘు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతు రాష్ట్రంలో జర్నలిస్టులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. అనంతరం తహశీల్దార్ వెంకటేశుకు వినతిని అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు షబ్బీర్, గంగప్ప, రమేష్, రాజేష్, అల్లి పీరా, అంజన మూర్తి, శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగులో మెలకువలు అవసరం

ప్రజాశక్తి - పరిగి

పంటల సాగులో మెళకువలు అవసరమని కషి విజ్ఞాన కేంద్రం డాక్టర్ మల్లికార్జున పేర్కొన్నారు. పరిగి మండలంలో వికసిత్ కషి సంకల్ప అభియాన్ కార్యక్రమం సందర్భంగా రైతులకు పంటసాగుపై అవగాహన కల్పించారు. వ్యవసాయ రంగంలో అధిక మోతాదు లో ఉపయోగించే ఎరువులు, పురుగు మందులకు స్వస్తి చెప్పి, పంటల సాగులో రైతులు వైవిధ్యతను ప్రోత్సహించాలని ఎస్ఎంఎస్ క్రాప్ ప్రొడక్షన్, డాక్టర్ ఎం హరిణి వెటర్నరీ సైంటిస్ట్ , డాక్టర్ బి ప్రతాప్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ ఆఫ్ అగ్రనమి ,యోగేందర్ హార్టికల్చర్ సైంటిస్ట్ చెప్పారు. పంటల సాగులో అనువైన విత్తనాలు, రకాలు వాతావరణ పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతుల అభిప్రాయాలను వారు వ్యవసాయంలో ఎదుర్కొంటున్న సమస్యలను వాటి నివారణ చర్యల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గోవిందరెడ్డి, జెడ్పిటిసి సూర్యనారాయణ, మండల వ్యవసాయ అధికారి యస్ విజయభారతి, వ్యవసాయ విస్తరణ అధికారి నాగవేణి, రైతు సేవ కేంద్ర సిబ్బంది మంజుల, హరీష్ ,అనసూయ , ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

ఓబులదేవరచెరువు :ఓబుల దేవర చెరువు, కొండకమర్ల ,రైతు సేవా కేంద్రాల నందు వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్నీ శాస్త్రవేత్తలు మాధవి, హార్టికల్చర్ శాస్త్రవేత్త మురుగన్, (భారతీయ నూనె గింజల పరిశోధన కేంద్రం హైద్రాబాద్, ఏడిఏ సెరికల్చర్ శివరామ్ నాయక్,మండల వ్యవసాయ అధికారి ఇలియాజ్ మహమ్మద్, నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయం లో తక్కువ పెట్టుబడి తో ఎక్కువ ఆదాయం ఎలా సాధించాలన్న దానిపై రైతులకు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలోఉద్యాన అధికారి లావణ్య, సిరికల్చర్ అధికారి మస్తాన్, మౌనిక, లలిత , వరలక్ష్మీ ,రైతులు, పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

ప్రజాశక్తి - బుక్కపట్నం

మండల పరిధిలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని ఎంపీడీవో శ్రీనివాసులు, ఎంపీపీ శ్రీధర్ రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనపర్చాలన్నారు. ఈ సందర్భంగా సభ్యులు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ వెంకటేష్ నాయక్, వ్యవసాయ శాఖ అధికారి సతీష్ బాబుతో పాటు ఆయా శాఖల అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఒత్తిడి దూరం : కలెక్టర్ చేతన్

యోగాసనాల్లో కలెక్టర్, మంత్రి, తదితరులు

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

యోగాతో ఒత్తిడి దూరం అవుతుందని కలెక్టర్ టిఎస్. చేతన్ పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బుధవారం ఉదయం ధర్మవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ యోగాంధ్ర మహోత్సవాల్లో భాగంగా జిల్లా ప్రభుత్వ యంత్రాంగం జిల్లాలోని అనేక ప్రాంతాలలో యోగాంధ్ర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఈనెల జూన్ 21 నాటికి కనీసం 2 కోట్ల మందికి యోగాసనాలను నేర్పించేందుకు ప్రతి గ్రామం , పట్టణంలోనూ యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాజంలోని ప్రతి ఒక్కరికి యోగాసనాలను చేరువగా చేసేందుకు దేశ ప్రధాని నరేంద్ర మోది ,రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కషి చేస్తున్నట్లు మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. యోగా పై అవగాహన పెంచుకొని యోగాసనాలు చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈనెల 21న విశాఖలో జరిగే యోగా దినోత్సవం కార్యక్రమానికి ప్రధాని హాజరవుతున్న నేపథ్యంలో కార్యక్రమాలను విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ధర్మవరానికి చెందిన బాపు బాలాజీ శ్రీ లలిత నాట్య మండలి లో చిన్నారులు ప్రదర్శించిన యోగా సాంస్కృతిక నాట్య కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎస్పీ, రత్న, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, మహిళా నాయకురాలు జయశ్రీ,, ఆర్డీవో మహేష్, డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ నరసయ్య, జిల్లా క్రీడా అభివద్ధి అధికారి ఉదయ భాస్కర్, పర్యాటక శాఖ మేనేజర్ ప్రతాపరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ జిల్లా అధికారులు స్వచ్ఛంద సేవా సంస్థలు ఉద్యోగులు, పలువురు ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు ,సామాజిక సేవా కార్యకర్తలు, వైద్య ఆరోగ్య సిబ్బంది ,విద్యార్థులు చిన్నారులు మహిళలు , పోలీసు, ఉద్యోగ సిబ్బంది యోగ శిక్షకులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో చిన్నారి మృతి

ప్రజాశక్తి బత్తలపల్లి

మండలంలోని సుబ్బారావుపేట అప్పరాచెరువు గ్రామాల మధ్య గ్యాస్ బొలెరో వాహనం ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ప్రమాదంలో ఏడాది వయస్సున్న చిన్నారి మృతిచెందింది. ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనకు సంబందించి పోలీసులు తెలిపిన వివరాలు... బత్తలపల్లి మండలం అప్పరాచెరువుకు చెందిన చాకల నరసింహులు, మణికంఠేశ్వరి అనే దంపతులు బుధవారం తమ కూతురు తన్మయితో కలిసి ద్విచక్ర వాహనంలో ధర్మవరం వెళ్లి స్వగ్రామానికి బయలు దేరారు. సుబ్బారావుపేట అప్రాచెరువు గ్రామాల మధ్య ఎదురుగా వస్తున్న గ్యాస్ బొలెరో వాహనం వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో నరసింహులు, మణికంఠేశ్వరి, వారి కూతురు తన్మయి తీవ్రంగా గాయపడ్డారు. గ్రామస్తులు గాయపడ్డ వారిని బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తన్మయి (1) మృతి చెందింది. తీవ్ర గాయాలపాలైన నరసింహులు, మణికంఠేశ్వరి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాద విషయం తెలుసుకున్న వైసీపీ మాజీ మండల కన్వీనర్ బగ్గిరి భయపరెడ్డి, ఈడిగ కాశప్ప, లింగమయ్య తదితరులు ఆర్డీటీ ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు.

లోకాయుక్త దాడులు

ప్రజాశక్తి - పావగడ

స్థానిక తహశీల్దార్ కార్యాలయంపై , లోకాయుక్త ఇన్‌స్పెక్టర్ అడివేశ గుడిగుబ్బ బుధవారం ఆకస్మిక దాడులు నిర్వహించి దస్త్రాలను పరిశీలించారు. కార్యాలయానికి చేరుకోగానే కార్యాలయ సిబ్బంది హాజరు పుస్తకాన్ని పరిశీలించారు. తహశీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. రొప్ప పంచాయతీకి చెందిన మడివాల రామప్పకు చెందిన భూమికి రుసుం చెల్లించినప్పటికీ సర్వే ఎందుకు నిర్వహించలేదని అడివేశ గుడిగుబ్బ సర్వే అధికారి చంద్రకళను ప్రశ్నించారు. కార్యాలయ ఆవరణలో పెరిగిన కలుపు మొక్కలని , కార్యాలయ ఆవరణలో స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన పనిచేయని శుద్ధి నీటి యూనిట్ ను పరిశీలించి, కార్యాలయం చుట్టూ ప్రజలు మూత్ర విసర్జన చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రెవెన్యూ, సర్వే శాఖకు ప్రజల నుంచి మొత్తం 22 ఫిర్యాదులు అందాయి. అయితే ఈ సమయంలో తహశీల్దార్ వరదరాజు పనుల నిమిత్తం ఎవరో ప్రాంతానికి వెళ్లినట్లు సమాచారం.

సైబర్ నేరగాళ్లు అరెస్టు

ప్రజాశక్తి - కదిరి టౌన్

తక్కువ ధరకు ఆర్వో ప్లాంట్ కు సంబంధించిన పరికరాలు ఇస్తామంటూ అమాయకుల నుండి భారీగా డబ్బు వసూలు చేసి మోసాలకు పాల్పడుతున్న ఇద్దరు సైబర్ నేరగాళ్లను అరెస్ట్ చేసినట్లు రూరల్ అప్గ్రేడ్ సిఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని రూరల్ అప్గ్రేడ్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సైబర్ నేరగాళ్ల అరెస్టు వివరాలను సీఐ నిరంజన్ రెడ్డి వెల్లడించారు. కర్నూలు జిల్లాకు చెందిన దంపతులు శ్రీనివాసరావు ,దుర్గాబాయిలు ఆర్వో ప్లాంట్ కు సంబంధించిన పరికరాలు తక్కువ ధరకు ఇస్తామంటూ రాష్ట్రవ్యాప్త మోసాలకు పాల్పడుతున్నారు. కది రూరల్ మండలం బోడే నాయక్ తండాకు చెందిన బాబ్జి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ రత్న ఆదేశాల మేరకు నిందితుల కోసం ప్రత్యేక టీం దర్యాప్తు చేపట్టింది. దర్యాప్తులో భాగంగా కదిరి సమీపంలో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుండి నాలుగు లక్షల రూపాయల నగదు ఎనిమిది మొబైల్ ఫోన్లు, 13 డెబిట్ కార్డులు, 52 సిమ్ కార్డులతో పాటు రెండు చెక్ బుక్కులు, పాన్ కార్డులు, బిల్ పుస్తకాలతో పాటు ఇతర విలువైన వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆరో ప్లాంట్ కు చెందిన పరికరాలను తక్కువ ధరకు ఇస్తామంటూ డబ్బులను ఆన్లైన్ ద్వారా సేకరించి అనంతరం ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి రాష్ట్రవ్యాప్తంగా శ్రీనివాసరావు ,దుర్గాబాయిలు మోసాలకు పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైంది. నిందితులకు సహకరించిన తిరుపతి జిల్లా చంద్రగిరికి చెందిన మోహన్ అనే వ్యక్తి పరారీలో ఉన్నాడు. నిందితులు శ్రీనివాసరావు, దుర్గాబాయిలను కోర్టులో హాజరుపరచుగా కోర్టు 14 రోజులు రిమాండ్ విధించింది. ఈ నేపథ్యంలో సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సిఐ నిరంజన్ రెడ్డి ప్రజలకు సూచించారు.

వేధింపులపై కేసు నమోదు

ప్రజాశక్తి - కొత్తచెరువు

మండలకేంద్రమైన కొత్తచెరువులో మహిళ ఫిర్యాదు మేరకు ఆమె భర్తపై వేధింపుల కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. గ్రామంలోని బిసి కాలనీకి చెందిన శృతిని ఆమె భర్త మణికంఠ రెండు సంవత్సరాల నుంచి వేధిస్తున్నట్లు బాధితురాలు ఫిర్యాదు చేసిందన్నారు. పది సంవత్సరాల క్రితం పెళ్లి అయిన తమకు ఇద్దరు పిల్లలు ఉన్నారని అయితే తన భర్త రెండు సంవత్సరాల నుంచి పనికి వెళ్లకుండా తాగుడుకు బానిసై తనను నిత్యం హింసిస్తున్నాడని ఫిర్యాదు చేసిందన్నారు. వేధింపుల విషయంపై శృతి కుటుంబసభ్యులకు కొత్తచెరువు సిఐ మారుతీ శంకర్ కౌన్సిలింగ్ ఇచ్చినప్పటికీ మార్పు రాకపోవటంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి ప్రాణాలు కాపాడిన పోలీసులు

ప్రజాశక్తి-హిందూపురం

వ్యాపారంలో నష్టం రావడం, అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఆత్మహత్యకు సిద్ధపడ్డ ఓ వ్యక్తి ప్రాణాలను హిందూపురం పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో ఆ వ్యక్తి ఎక్కడ ఉన్నాడో ఆచూకీ గుర్తించి కాపాడిన సంఘటన చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. హిందూపురం పట్టణంలోని విద్యానగర్ కు చెందిన త్యాగరాజు అనే వ్యక్తి కర్నాటక బ్యాంకు నందు గోల్డ్ అప్రైజర్ గా పని చేస్తున్నాడు. ఇతను మూడు నెలల క్రితం హిందూపురంలో తెలిసిన వారి వద్ద, ఫైనాన్స్ కంపెనీల్లో రూ.15 లక్షల దాకా అప్పులు చేసి మామిడి తోటలు కొనుగోలు చేశాడు. అయితే వివిధ కారణాల వల్ల కొనుగోలు చేసిన తోటల ద్వారా కనీసం పెట్టుబడులు రాకపోగా నష్టం వచ్చింది. దీంతో చేసిన అప్పులు తిరిగి చెల్లించలేక, పరువు పోతుందన్న ఆలోచనతో ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని వీడియో తీసి సోదరుడికి పంపించారు. ఈ వీడియో చూసిన అన్న వెంటనే వీటిని హిందూపురం డి.ఎస్.పి కె.వి మహేష్ కు పంపారు. వెంటనే స్పందించిన డీఎస్పీ ఈ విషయాన్ని టూ టౌన్ సీఐ అబ్దుల్ కరీం, వన్ టౌన్ ఎస్ఐ శ్రీధర్ లకు సమాచారం అందించారు. దీంతో సాంకేతిక పరిజ్ఞానం ద్వారా త్యాగరాజు ఉన్న ప్రాంతాన్ని గుర్తించారు. వెంటనే సిఐ,ఎస్ఐ తమ సిబ్బందితో వెళ్లి త్యాగరాజును పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి కౌన్సిలింగ్ ఇచ్చి పంపినట్లు సిఐ కరీం తెలిపారు. సకాలంలో స్పందించి కుటుంబ యజమాని ప్రాణాలు కాపాడటం పట్ల కుటుంబ సభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఓ నిండు ప్రాణాన్ని కాపాడటంలో స్పందించిన డీఎస్పీ కెవి మహేష్, సిఐ అబ్దుల్ కరీం, ఎస్ఐ శ్రీధర్ తదితర పోలీసు సిబ్బందిని ఎస్పీ వి. రత్న అభినందించారు.

అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండలంలోని గోడ్డు వెలగల పంచాయతీలో చేపట్టిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ బుధవారం ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంవత్సరం కాలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బాబురావు ఎంపీడీవో వెంకటరామిరెడ్డి, పిఆర్ జెఇ రెడ్డి ప్రసాద్, ఎపిఒ చంద్రశేఖర్, టిడిపి మండల కన్వీనర్ సి కొండయ్య, ఎంపీపీ జి సోమశేఖర్ రెడ్డి, మాజీ సింగల్‌విండో అధ్యక్షుడు వెంకటరమణారెడి తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ సిడిపిఒగా ధనలక్ష్మి

ప్రజాశక్తి-పెనుకొండ

పెనుకొండ ఐసిడిఎస్ సిడిపిఒగా ధనలక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా అనంతపురం రూరల్ నుంచి ధనలక్ష్మి బదిలీ పై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న శాంతలక్ష్మి సోమందేపల్లి సిడిపిఒగా బదిలీ అయ్యారు. ఈసందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ ప్రాజెక్టు పరిధిలో అన్ని కేంద్రాలను పరిశీలిస్తామన్నారు. పెనుగొండ ప్రాజెక్టును ఉత్తమ ప్రాజెక్టుగా తీర్చి దిద్దేందుకు కృషి చేస్తామన్నారు.